
ప్రాజెక్టుల్లోకి పెరిగిన ఇన్‌ఫ్లో



2





2

పిచ్చికుక్క స్వైరవిహారం పదిమందిపై దాడి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో గల డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ, తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.



## జిల్లా విద్యాభివృద్ధికి సమిష్టి కృషి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న డీఈవో అశోక్

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆయన శనివారం విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు ఎన్‌రోల్‌మెంట్ ఎంత జరిగింది, పాఠశాలలకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారా తదితర విషయాలను డీఈవోను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈనెల 29న నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాలను 30వ తేదీకి వాయిదా వేయాలని కోరారు. ఆ రోజున నాగుల పంచమి కారణంగా తరువాత రోజు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## కేన్సర్ శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కేన్సర్ టెస్ట్ శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కామారెడ్డి రోటరీ క్లబ్, ఐఎంఏ కామారెడ్డి శాఖ సహకారంతో కేన్సర్ ఉచిత నిర్ధారణ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 350 మందికి పైగా పరీక్షలు చేశారు. శిబిరాన్ని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా టెస్టులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో ప్రమీల, కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ మధు దేవరశెట్టి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శంకర్, అసిస్టెంట్ గవర్నర్ జైపాల్ రెడ్డి, సెక్రెటరీ కృష్ణ హరి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్గిరెడ్డి రవీందర్ రెడ్డి, రోటరీ ట్రెజరర్ వెంకట రమణ, సభ్యులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండానే నిర్మాణం..



**నిజామాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపులేకుండా పోయింది. కొందరు బడాబాబులు, రియల్టర్లు, రాజకీయ నాయకులు దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, నిబంధనలు పాటించకుండానే భవనాలు పూర్తి చేస్తున్నారు. వీరికి నగర పాలక సంస్థ అధికారులు అన్ని రకాల అండదండలు అందిస్తున్నారు. ఇందుకు నగరంలోని ఓ ప్రధాన రోడ్డు వెంబడి నిర్మాణంలో ఉన్న భవనమే ఉదాహరణ.** – అక్షరటుడే, నిజామాబాద్

**▸ పట్టించుకోని యంత్రాంగం.. ▸ బీజేపీ నాయకుడికి అండదండలు..**

సామాన్య ప్రజలు చిన్నపాటి ఇల్లు కట్టుకుంటే అనుమతుల పేరిట మున్సిపల్ అధికారులు హడావుడి చేస్తారు. అనుమతులు లేవని సామాగ్రి సీజ్ చేయడంతో పాటు నోటీసులు ఇస్తారు. ఇదే అదునుగా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు డబ్బులు దండుకోవడం సర్వసాధారణం.

అయితే వర్ని రోడ్డులోని ఓ బార్ సమీపంలో ప్రధాన రోడ్డు వెంబడి బీజేపీకి చెందిన నాయకుడు ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. కాగా.. ప్రస్తుతం భవనం మొత్తం పూర్తి కావాల్సి వచ్చింది. అయినా ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం గమనార్హం. ప్రత్యేకించి ప్రధాన రహదారిని ఆనుకొని ఈ భవన నిర్మాణం జరుగుతున్నా.. మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం కొసమెరుపు.

బీజేపీకి చెందిన సదరు నాయకుడు టీఎస్ బీపాస్ కింద ఐదంతస్తుల భవనం నిర్మాణానికి అనుమతి దరఖాస్తు చేసుకున్నాడు. కాగా.. నిబంధనల ప్రకారం నిర్మాణం జరగట్లేదని క్షేత్రస్థాయి అధికారులు గుర్తించారు. సెల్లార్‌తో పాటు ఐదంతస్తుల భవనం నిర్మాణం చేపట్టగా డీవియేషన్లు ఉన్నట్లు తేల్చారు. అనంతరం అప్లికేషన్‌ను కూడా తిరస్కరించి అనుమతులు నిరాకరించారు. ప్రక్రియ అంతా కూడా ఈ ఏడాది మార్చిలోనే జరిగిపోయింది. అయినప్పటికీ.. సదరు నాయకుడు తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని దర్జాగా బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేస్తుండడం గమనార్హం.

ఒకవిధంగా నగర పాలక సంస్థలో ఉండే అధికారులే సహకరిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో ఓ డివిజన్‌కు ప్రజాప్రతినిధిగా వ్యవహరించిన సదరు నాయకుడు చిన్నపాటి ఇంటి నిర్మాణం చేపట్టినా తనకు ఎంతో కొంత ఇవ్వనిదే పనులు పూర్తి కానిచ్చేవాడు కాదని విమర్శలు ఉన్నాయి.

అనుమతులు లేని వాటికి పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేయగా.. అప్పట్లో పలు ఆడియో రికార్డులు వైరల్ అయ్యాయి. ప్రస్తుతం ఏ అధికారం లేకపోయినప్పటికీ.. దర్జాగా అక్రమ నిర్మాణం చేపడుతున్నా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## ఎడతెరిపిలేని వాన..



**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గత రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో భారీ వర్షా లు పడుతున్నాయి. దీంతో జలాశయాలు, చెరువులు, వాగులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. పలుచోట్ల చెరువులు అలుగు పారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన జలాశయాలైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులకు స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది.**


– వివరాలు 2లో




## కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**అక్షరటుడే, ఇందూరు:** దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని శనివారం ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26 సంవత్సరాల క్రితం దేశ సైనికులు ఎనలేని పోరాటం చేశారన్నారు. వారి త్యాగాలను జీవితాంతం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1999లో కార్గిల్ యుద్ధం జరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా తెలిపారు. 527 మంది సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను మన సైన్యం మట్టుబెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు న్యాలం రాజు, నాగోల్ల లక్ష్మీనారాయణ, శ్రీధర్, బొట్టు వెంకటేష్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలి

**అక్షరటుడే ఇందల్వాయి:** విద్యార్థులకు పక్షం రోజులకొకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలతో పాటు, అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. ముందుగా బాలికల రెసిడెన్షియల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుండగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో 640 మంది విద్యార్థినులు ఉండగా, వారికి నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. మెనూను పరిశీలించి, తదనుగుణంగా ఆహార పదార్థాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. అనంతరం ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ కోడిగుడ్డు అందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరుమన బడి' కింద నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపి వేయడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, విద్యార్థుల నమోదుతో పాటు క్రమం తప్పకుండా వారు బడికి వచ్చేలా పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

## ఎల్లారెడ్డి ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌ల నియామకం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు గైనకాలజిస్టులను వైద్యారోగ్యశాఖ నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అంశాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల జరిగిన సమీక్షలోనూ వైద్యుల కొరతపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే నియమించాలని కోరారు. దీంతో స్పందించిన అధికారులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి ముగ్గురు గైనకాలజిస్ట్‌లను నియమించారు. వారానికి రెండురోజుల చొప్పున పనిచేసేలా ముగ్గురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## జీజీహెచ్‌లో నెలలోపు మరమ్మతులు పూర్తవ్వాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం ఆస్పత్రిని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో డ్రెయినేజీ వ్యవస్థ, టాయిలెట్లు చక్కదిద్దాలన్నారు. లీకేజీలను అరికట్టాలని, ఫ్లోరింగ్, ఆస్పత్రి ముందు భాగంలో కిటికీలు తదితర మరమ్మతులు నెలలోపు పూర్తి చేయాలని ఆస్పత్రి ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో వైద్యసేవలను మరింతగా మెరుగుపర్చాలని.. అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం 180 మంది వైద్యులు, సరిపడా సిబ్బందితోపాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మేజర్, మైనర్ సర్జరీలతో పాటు షుగర్, బీపీ, డెంగీ, మలేరియా, థైరాయిడ్ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని వాటిని వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జీజీహెచ్‌లో కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండడం అభినందనీయమని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. డెంటల్ విభాగం ఆధ్వర్యంలో సర్జరీలను కూడా చేస్తున్నారని తెలిపారు. ఆస్పత్రికి అవసరమైన అధునాతన వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిధుల మంజూరు చేయిస్తానని చెప్పారు. 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి కావడంతో నిర్వహణపరమైన లోపాలను కూడా చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీజీహెచ్ ముందు ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం, క్రిటికల్ కేర్ యూనిట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరలోనే భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. అలాగే బోధన్, ఆర్మూర్ తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో నెలకొన్న ఇబ్బందులను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులున్నారు.



## ప్రాణనష్టం వాటిల్లకుండా చూడాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లాలో ముఖ్యంగా శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎస్సారెస్పీ పరివాహక ప్రాంతంతో పాటు కాల్వలు, చెరువులు, ఇతర జలాశయాల్లో ఎవరూ చేపల వేటకు వెళ్లకుండా చూడాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహా ఆయా శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలో వర్షాల వల్ల ఎక్కడ ఇబ్బందులు ఏర్పడినా..08462 - 220183కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అక్షర టుడే Web News E-Paper

TOWARDS... TRUTH. TRUST. TREND

విలేకరులు కావలెను

అనతి కాలంలోనే మిలియన్ల మంది పాఠకులను సొంతం చేసుకుని.. డిజిటల్ మీడియాలో దూసుకెళ్తున్న అక్షరటుడేలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం ఉండి.. అనుభవజ్ఞులైన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆర్మూర్, బాల్కొండ, నందిపేట, కామారెడ్డి, వర్ని, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్‌లకు విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు 9010337369 నంబరును సంప్రదించగలరు

WWW.AKSHARATODAY.IN

## ప్రాజెక్టుల్లోకి పెరిగిన ఇన్‌ఫ్లో



**అక్షరటుడే, ఆర్మూర్:** నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురిసిన వర్షానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. నిన్నటి వరకు రెండు వేల నుంచి మూడు వేల క్యూసెక్కుల వరద రాగా.. శనివారం ఉదయానికి 4,500 క్యూసెక్కులకు పెరిగింది. శనివారం ఉదయం 9 గంటల వరకు ప్రాజెక్ట్‌లో 1069.1 అడుగుల (21.882 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్‌లో..



**అక్షరటుడే, నిజాంసాగర్:** మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురిసిన వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. శనివారం ఉదయం జలాశయంలోకి 1,269 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఈఈ సోలోమాన్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1390.50 అడుగుల (4.25 టీఎంసీలు) నీరు ఉంది.

### పోచారంలోకి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్మం మండలాల వరప్రదాయని పోచారం ప్రాజెక్టులోకి వరదనీరు చేరుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాంధారి పెద్దవాగు, తాడ్వాయి భీమేశ్వరం వాగుల ద్వారా 1,515 క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వస్తోంది.



పొంగిపొర్లుతున్న సింగితం

ఉమ్మడి జిల్లాలో వాన దంచికొడుతోంది. గత మూడు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షా లు పడుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు వానలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. సాగు చేసిన పంటలు ఎండు ముఖం పట్టాయి. ఈ తరుణంలో వర్షా లు కురుస్తుండడంతో పంటలకు జీవం వచ్చింది. వర్షా లతో పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

– అక్షరటుడే, ఇందూరు

# తెరిపినివ్వని వాన

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షా లు
- చెరువులు, వాగులకు జలకళ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- నిజామాబాద్‌లో 3.24 సెం.మీ.. కామారెడ్డిలో..

ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి ఇప్పటికే వాతావరణ శాఖ కూడా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో శనివారం 3.24 సెం.మీ వర్షపాతం నమోదయింది. జిల్లాలో అత్యధికంగా చందూరు మండలంలో 5.7 సెం. మీ, కోటగిరిలో 5.6, రుద్రూర్‌లో 5.4, పోతంగల్ 5.2, వర్నిలో 4.7 సెం. మీ వర్షపాతం నమోదయింది. మోపాల్‌లో అత్యల్పంగా 1 సెంటీ మీటర్ల, కమ్మర్‌పల్లి లో 1.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా జూన్ 1 నుంచి జూలై 26 వరకు 39.3 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 28.7 సెం.మీ. వర్షం పడింది.

కామారెడ్డి జిల్లాలోని డొంగ్లిలో 50.5మి.మీ వర్షం పడింది. కామారెడ్డిలో 41.5, పాల్వంచ 39.1, నాగిరెడ్డి పేట 36.3, భిక్కనూరు 35.8, పిట్లంలో 33.7 మి.మీ. వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 352.8 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా.. 338.2 మి.మీ. వాన పడింది.

### లోతట్టు ప్రాంతాలు జలమయం

వర్షాలతో నిజామాబాద్ నగరంతో పలు పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. ముసురు వాన పడుతుండటంతో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని సూచిస్తున్నారు.

### పొంగిపొర్లుతున్న వాగులు

మూడు రోజులుగా పడుతున్న వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, ప్రాజెక్ట్‌లలోకి నీరు చేరుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లా మారాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ప్రాజెక్ట్‌లు శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. సింగితం, పోచారం జలశయాల్లోకి భారీగా వరద వస్తోంది. లింగంపేట వాగు, పోతంగల్ కొల్లూరు వాగు, కాటేవాడి తండా సమీపంలోని వాగు ఉధృతంగా పారుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు, నదుల వద్ద వెళ్లొద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



పోతంగల్ కొల్లూరు వాగులో రోడ్డుపై నుంచి పారుతున్న వరద నీరు



బోధన్‌లో షర్బత్ కెనాల్‌కు చేపట్టిన మరమ్మతులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



అమ్లరబండ వద్ద విద్యార్థులను కేజీవీల్ ట్రాక్టర్‌పై వాగు దాటిస్తున్న స్థానికులు



ఉధృతంగా ప్రవహిస్తున్న లింగంపేట వాగు



అలుగు పారుతున్న సిర్నాపల్లి చెరువు



వర్ని మండలం సిద్ధాపూర్‌లో రోడ్డుపై నుంచి పారుతున్న వాగు నీరు

## ఆర్‌ఎంపీ, పీఎంపీలు పరిధి దాటి వైద్యం చేయవద్దు



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేయవద్దని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. మాతా శిశు ఆస్పత్రిలో శనివారం డివిజన్ పరిధిలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్లినిక్‌లకు వచ్చే రోగులకు ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని, యాంటీబయటిక్స్, ఇతర హైడోస్ మందులు ఇవ్వొద్దని హెచ్చరించారు. మలేరియా, డెంగీ, పోలియో కేసులు వస్తే వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పరిమితికి లోబడి వైద్యం అందించాలని, రోగుల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ అశోక్, వైద్యులు రోహిత్, సీహెచ్‌వో దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు: మహిళ మృతి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ఆర్టీసీ బస్సు కారును ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మాక్లూర్ మండల శివారులో శని వారం ఉదయం చోటు చేసుకుంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు మాక్లూర్ నుంచి నిజామాబాద్ వస్తున్న కారును దాస్‌నగ ర్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ మహమ్మదీ (52) అక్కడికక్కడే మృతి చెందింది. కా రులో ప్రయాణిస్తున్న మహమ్మదీ కొడుకు, కోడలు, కూతురికి గాయాలయ్యాయి. వీరిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా బస్సు నడపడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. మృతురాలి భర్త షేక్ బషీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.




## చోరీ కేసులో ఒకరి రిమాండ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆలయంలో చోరీ చేసిన ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్‌కు చెందిన గుంజ గంగాధర్ (58) ఈ నెల 23న రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశపూర్ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి బంగారు పుస్తెలు, పంచలోహ వినాయక విగ్రహం, హుండీలోని నగదు దొంగిలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి వినాయకుడి పంచలోహ విగ్రహం, బంగారు పుస్తెలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

## దాడి కేసులో ఒకరి అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దాడి కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన షేక్ రియాన్ (19) అదే ప్రాంతానికి చెందిన చెందిన షేక్ అఫ్సర్ అలీపై ఈనెల 17న నకుల్ పంచ్‌తో తలపై దాడి చేసి పరారయ్యాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా, శనివారం నిందితుడు రియాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఇసుక లారీ పట్టివేత

**అక్షరటుడే, కోటగిరి :** అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. శనివారం ఉదయం పోతంగల్ మండలం మంజీర పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండడంతో, ఈ మేరకు కొల్లూరు శివారులో లారీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మాజీ మహిళా సర్పంచ్ బలవన్మరణం



**అక్షరటుడే, భీమ్‌గల్:** మాజీ మహిళా సర్పంచ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భీమ్‌గల్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జోరా తాజా మాజీ సర్పంచ్ కోగూరు ప్రతిభ కొంత కాలంగా మానసిక సమస్యతో బాధపడుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. జిల్లాలో ఇటీవల పెరుగుతున్న ఆత్మహత్య ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో కొందరు, మానసిక, ఆరోగ్య సమస్యలతో మరి కొందరు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కారణం ఏదైనా క్షణికావేశంలో సూసైడ్ చేసుకుంటున్నారు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని.. చనిపోయే ముందుకు ఒక్క క్షణం ఆలోచించి.. ధైర్యంతో ముందడుగు వేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం.. పదిమందిపై దాడి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. శనివారం ఉదయం ఇందిరానగర్ నుంచి బస్టాండ్ వరకు పది మందిపై దాడిచేసింది. రోడ్డుపై వెళ్తున్న ప్రజలపై దాడి చేస్తూ గాయపర్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు తీశారు. ఆస్పత్రిలో కుక్కకాటు బాధితులకు చికిత్స అందించారు. కాగా.. తీవ్రంగా గాయపడిన బాధితులకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో బాధితులను కామారెడ్డి, బాన్సువాడ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈ విషయమై పలువురు బాధితులు ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. సకాలంలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని నినాదాలు చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎల్లారెడ్డి పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలతో పాటు కోతుల దాడులు సైతం అధికమయ్యాయని.. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మాలల ఆత్మీయ సమ్మేళనం వాయిదా



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలో ఈనెల 27న (ఆదివారం) నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనం వాయిదా పడింది. సమ్మేళనంను వాయిదా వేస్తున్నట్లు మాల సంఘం తెలంగాణ వ్యవస్థ పాకుడు అయ్యాల సంతోష్, డివిజన్ అధ్యక్షుడు మిర్జాపురం సాయన్న తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంఘం సభ్యుల కోరిక మేరకు వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. తదుపరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని వాయిదా వేసిన విషయాన్ని మాల సంఘ నాయకులు గమనించాలని వారు కోరారు.

## మాజీ ఎంపీపీ మృతి పార్టీకి తీరని లోటు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మండల తాజా మాజీ ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతూ శుక్రవారం రాత్రి పిప్పిరి ఆంజనేయులు మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పార్టీ నాయకులు ఆంజనేయులు పార్థీవ దేహానికి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచే సమయంలో గంప గోవర్ధన్ భావోద్వేగానికి గురయ్యారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సహచర మిత్రుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు.